క్లుప్తంగా

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని వెంకాయపల్లె గ్రామ సమీపంలో వెలసిన ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి పిండివంటలు, గుగ్గిళ్లు, భక్షాలు నైవేద్యంగా సమర్పించారు. కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

వృద్ధులకు ఇళ్ల వద్దే రేషన్



ఇనగండ్లలో రేషన్ పంపిణీని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం

సి.బెళగల్: మండలంలో 65 ఏళ్లు పైబడిన వారికి ఇళ్ల దగ్గరే రేషన్ సరుకులను డీలర్లు పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఇనగండ్ల 33వ రేషన్ షాప్‌లో సరుకుల పంపిణీని తనిఖీ చేశారు. డీలర్లు సరుకుల పంపిణీలో సమయపాలన పాటించాలని సూచించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ తరుణ్, వీఆర్ఏ భాస్కర్ తదితరులు ఉన్నారు.

అమ్మవారికి వెండికిరీటం కానుక



వెండి కిరీటాన్ని సమర్పిస్తున్న భక్తుడు

కోడుమూరు రూరల్: గూడూరు మండలం కె.నాగలాపురం గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరి అమ్మవారికి క్రిష్ణగిరి మండలం సంగాల గ్రామస్తుడు కురువ సుంకన్న 238 గ్రాముల వెండి కిరీటాన్ని కానుకగా సమర్పించారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ఆలయ సిబ్బందికి కిరీటాన్ని అందజేసి మొక్కు తీర్చుకున్నారు. దాతకు ఆలయ సిబ్బంది అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

రేషన్ దుకాణాల తనిఖీ



రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కోడుమూరు రూరల్: డీలర్లు ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ సరుకులను కార్డుదారులందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని గూడూరు తహసీల్దార్ రామాంజినేయులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని గుడిపాడు, పెంచికలపాడు, కె.నాగలాపురం, బూడిదపాడు గ్రామాల్లోని రేషన్ దుకాణాలను తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాలకు సంబంధించి సరుకుల స్టాక్ వివరాలను తహసీల్దార్ పరిశీలించారు. ప్రతి డీలర్ కార్డుదారులకు అందుబాటులో ఉంటూ రేషన్ సరుకులను సక్రమంగా అందజేయాలని, పంపిణీలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఎవరైనా డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పడకేసిన పారిశుద్ధ్యం



పాఠశాల ముందు పారుతున్న మురుగునీరు

కర్నూలు(రూరల్): మండలంలోని దిగువపాడు గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఆ రోడ్డు మీదుగా వెళ్లాలంటే ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి. మురుగునీరు వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. పంచాయతీ అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి మోసాలను ఎండగడదాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు



మాట్లాడుతున్న పార్టీ సి.బెళగల్ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి

● 'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి

కోడుమూరు రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలపై బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వెన్నుపోటు దినం'ను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం కోడుమూరులో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయకుండా ప్రజలను దగా చేస్తోందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రద్దు చేయడంతో పాటు, ప్రజలకు ఎలాంటి పథకాలు ఇవ్వకుండా దారుణంగా మోసం చేసిందన్నారు. గూడూరులో నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చి కూటమి మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, సూరి, మధు, సంగాల మద్దీ తదితరులు పాల్గొన్నారు.

అన్యాయంపై ప్రశ్నిద్దాం

సి.బెళగల్: పార్టీ అధిష్టానం పిలుపే మేరకు బుధవారం చేపట్టనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సి.బెళగల్‌లో మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేస్తోందన్నారు. చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయంపై ప్రశ్నించేందుకు బుధవారం ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించి గూడూరులో నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఉదయం 10 గంటలకు గూడూరు పాత బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ ఉంటుందన్నారు. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శులు మహానంది, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, సింగల్‌విండో మాజీ చైర్మన్ సీబీ గోవింద రెడ్డి, సి.బెళగల్, బ్రాహ్మణదొడ్డి సర్పంచ్‌లు పాండురంగన్న, దస్తగిరి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శోభన్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల మద్దతు



కోడుమూరులో మద్దతు తెలియజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

కోడుమూరు రూరల్: జగనన్న కష్టకాలంలో తమను బియ్యం పంపిణీ వాహనాల ఆపరేటర్లుగా నియమించి ఉపాధి కల్పించారని.. అయితే సీఎం చంద్రబాబు తమను తొలగించి కుటుంబాలను రోడ్డుపాలు చేశారని కోడుమూరుకు చెందిన ఎండీయూ ఆపరేటర్లు వాపోయారు. మంగళవారం కోడుమూరు మండలానికి చెందిన ఎండీయూ ఆపరేటర్లు నాగభూషణం రెడ్డి, ఎల్లాక్రిష్ణ, శ్రీనివాసులు, మురళీ, చంద్ర మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఉన్న ఫలంగా తమకు ఉద్యోగాలు లేకుండా చేసి దారుణంగా మోసం చేసిందన్నారు. 2027 వరకు తమకు జనగన్న ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఇచ్చిన జీఓను కూటమి ప్రభుత్వం పక్కనబెడుతూ ఉద్యోగాల్లో నుంచి తీసివేయడమేమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బుధవారం నిర్వహించతలపెట్టిన ‹వెన్ను పోటు దినం›కు ఎండీయూ ఆపరేటర్లంతా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. తమకు జరిగిన అన్యాయానికి నిరసన వ్యక్తం చేస్తామన్నారు. బియ్యం పంపిణీ వాహనాలను కొనసాగించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

క్షయ వ్యాధిని నిర్మూలించండి



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఓర్వకల్లు: సమాజంలో క్షయ వ్యాధిని నిర్మూలించాలని తహసీల్దార్ విద్యా సాగర్ అన్నారు. మంగళవారం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాల్వ గ్రామ 2వ సచివాలయం (కాల్వబుగ్గ) క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జె.రేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తహసీల్దార్ విద్యా సాగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ ముక్త్ భారత్ అభియాన్-ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. క్షయ వ్యాధి వల్ల వచ్చే అనార్థాలపై ప్రజలను చైతన్య పరచి, వాటి నిర్మూలనకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంపీహెచ్‌ఓ విలియం రాబర్ట్, సీహెచ్‌ఓ తెనాలి రామకృష్ణ, ఆరోగ్య కార్యకర్త రాములమ్మ, కాల్వబుగ్గ పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-5) నరేష్, టీబీ సూపర్‌వైజర్ ఇమ్రాన్‌బాషా, జిల్లా టీబీ కో-ఆర్డినేటర్ ఉమాపతి, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



వంటకాలను ప్రదర్శిస్తున్న ఎంఈఓ ఓంకార్‌యాదవ్

ఓర్వకల్లు: పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం తయారీలో తప్పనిసరిగా మెనూ పాటించాలని ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో వివిధ పాఠశాలలకు చెందిన వంట ఏజెన్సీలకు మధ్యాహ్న భోజనం తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. భోజనం తయారీలో మెనూ ఏవిధంగా పాటించాలి? తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి ఏజెన్సీలకు తెలియజేశారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన ఎస్తేరమ్మను అభినందించారు. ఎస్తేరమ్మ వారం రోజుల పాటు పాటించాల్సిన మెనూ, పాటించాల్సిన నిష్ట, నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు పాటించాల్సిన మెనూ ప్రకారం తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. ఎంఆర్‌సీ సిబ్బంది, వంట కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



నన్నూరులో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీ ప్రజలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో 11, 12వ వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసుల తరఫున సీపీఎం కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం ఆయా వార్డులను పరిశీలించి, తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం, పాలకుల వైఫల్యం మెండుగా కనిపిస్తోందని విమర్శించారు. 11, 12వ వార్డుల్లో గత రెండు నెలల నుంచి తాగునీటి కోసం కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నీటి కోసం పనులు వదులుకొని, పొలాల్లోకి వెళ్లి బోర్ల వద్ద మంచినీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాలనీ ప్రజలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. కాలనీవాసులు రామకృష్ణ, ఈశ్వరమ్మ, లాల్‌బి, జరినాబీ, పార్వతమ్మ, లక్ష్మీదేవి, మౌనమ్మ, యోగి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎర్రబురుజు యూపీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశా సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆశా యాప్‌లో అర్హులైన దంపతులకు అందించిన సేవలు, ఐరన్ మాత్రల పంపిణీ, విటమిన్-ఏ ద్రావణ పంపిణీ, నవజాత శిశు సేవల వివరాలను క్రమం తప్పక అప్‌లోడ్ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, డయేరియా తదితర వాటి గురించి అవగాహన కల్పించాలన్నారు. గర్భవతులకు నాల్గవ నెల నుంచి ప్రసవానంతరం బిడ్డకు ఒక సంవత్సరం వయస్సు వచ్చే వరకు మాతాశిశు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కోసం 01244451660 నంబర్ నుంచి వచ్చే కిల్కారి మెసేజ్‌ల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఉచిత ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి వారు ఓపీ సేవల కోసం వచ్చేటప్పుడు ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ తీసుకొని వచ్చేలా కృషి చేయాలన్నారు. అసంక్రమిత వ్యాధులపై సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. డీపీఎంఓ డాక్టర్ ఉమా, డెమో శ్రీనివాసులుశెట్టి, డీపీఓ విజయరాజు, వైద్యాధికారి డాక్టర్ తేజశ్రీ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామానికి చెందిన ఉతయ్య, కోసిగి గ్రామానికి చెందిన పులి ఏసురాజులు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కోసిగి గ్రామ శివారుల్లోని జంపాపురం రోడ్డులో కర్ణాటక మద్యం తరలిస్తుండగా వారి వద్ద నుంచి 216 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే వారి వద్ద మట్కా చీటీలు, రూ.2,750ల నగదు కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని రిమాండుకు తరలించినట్లు వెల్లడించారు.

ఉచిత విద్యకు నిరాకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న తల్లిదండ్రులు

● కలెక్టర్ ఫిర్యాదు చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

కర్నూలు(సెంట్రల్): పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత విద్యను నిరాకరిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం కొందరు తల్లిదండ్రులు కలెక్టర్ పి.రంజిత్‌బాషాను ఆయన కార్యాలయంలో కలసి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్ష పరిశీలన అనంతరం ఆర్‌టీఈ చట్టం 2009 సెక్షన్ 12(1)(సీ) ప్రకారం 2025-26 విద్యా సంవత్సరంలో మొదటి తరగతిలో ప్రవేశం కోసం లాటరీ పద్ధతిలో సీటును పొందినా శ్రీచైతన్య, నారాయణ, మాంటిస్సోరి, భాష్యం, ఏథె నా, సిస్టర్ స్టానిస్లాస్, సెయింట్‌జోసెఫ్, ఆదిత్య, సర్వేపల్లి, రవీంద్ర, కేవీఆర్, ఇండస్ పాఠశాలలు అడ్మిషన్‌ను నిరాకరిస్తున్నాయని, డోనేషన్ ఇస్తేనే చేర్చుకుంటామని చెబుతున్నాయని తల్లిదండ్రులు శంకర్‌కుమార్, సుధీర్, రాజు, శివశంకర్, నాగేష్ ఫిర్యాదు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ఓర్వకల్లు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఆరోగ్యం, ఆనందం ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్థానిక రాక్‌గార్డెన్‌లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు, ఎమ్మెల్యే గౌరు చరిత, జేసీ నవ్య, మండల సమాఖ్య గౌరవాధ్యక్షురాలు విజయ భారతి, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న నిర్వహించే యోగా కార్యక్రమంలో కర్నూలు జిల్లా వ్యాప్తంగా 10 లక్షల మంది పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లు, ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయని చెప్పారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నాలుగు ప్రాంతాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు స్థలాలను గుర్తించినట్లు చెప్పారు. జూన్ 12న కొండారెడ్డి బురుజు, 18న మంత్రాలయం వద్ద, 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో జూన్ 17న కర్నూలు నగరంలో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ.. జూన్ 21న విశాఖలో నిర్వహించనున్న యోగా కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాశ్ శెట్టి, యోగా గురువులు మునిస్వామి, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు గంటసేపు యోగాసనాలు వేయించారు. టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ బేగం, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, యోగాభ్యాసకులు, ప్రజలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

కల్లూరు: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డీఎల్‌డీఓ రమణారెడ్డి, మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) వేణుగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఎంపీడీఓ నాగశేషాచల రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గొల్లలదొడ్డిలో టీబీ పరీక్షలు

సి.బెళగల్: మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామంలో బుధవారం క్షయ వ్యాధి (టీబీ) నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని డివిజన్ టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర అన్నారు. మంగళవారం టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలో టీబీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా 60 ఏళ్లుపైబడి, బీపీ, షుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్న వారికి గళ్ల పరీక్షలు చేస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలపాటు ఉచితంగా మందులు, పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.1000 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. గొల్లలదొడ్డి గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కర్నూలు(రూరల్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు. హాజరుకాని అధికారులపై శాఖా పరమైన చర్యలు ఉంటాయన్నారు.

చీటింగ్ కేసు నమోదు

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు గ్రామానికి చెందిన టంగుటూరి శ్రీనివాసులుపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ అనే వ్యక్తి నుంచి రూ.8,42,350 విలువచేసే పంట దిగుబడులను కొనుగోలు చేసి డబ్బు చెల్లించకుండా కులం పేరుతో దూషించడంతో టంగుటూరి శ్రీనివాసులు అనే వ్యాపారిపై చీటింగ్ కేసు, ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా 16 రోజుల పండుగ

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో 16 రోజుల పండగను ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఆలయ గాలిగోపుర కలశ ప్రతిష్ఠ సందర్భంగా నూతన కలశాలను ఏర్పాటు చేశారు. దీంతో మంగళవారం 16 రోజుల పండుగను నిర్వహించినట్లు ఈఓ రామక్రిష్ణ తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలుగొట్లలో కోవిడ్ పాజిటివ్

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో కోవిడ్ పాజిటివ్ కేసు నమోదు అయింది. గ్రామానికి చెందిన వృద్ధుడు జ్వరం, ఆయాసంతో సోమవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వెళ్లాడు. అక్కడ వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారించడంతో ప్రత్యేక వార్డుకు తరలించారు. మంగళవారం విషయం తెలుసుకున్న దైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది గ్రామానికి వెళ్లి రోగి ఇంటి వద్ద వివరాలు సేకరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో త్వరలో క్యాంప్ ఏర్పాటు చేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు.

మండలానికి 4,540 మొక్కలు మంజూరు



ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షిస్తున్న ఏపీఓ

సి.బెళగల్: కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా గ్రామాల వారీగా అవసరమైన మొక్కలు, నాటే ప్రాంతాల వివరాలను అందించాలని ఉపాధి హామీ ఏపీఓ రామన్న అన్నారు. మంగళవారం ఉపాధిహామీ ఈసీ రంగస్వామితో కలిసి టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బందితో కలిసి కోట మొక్కల కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలానికి 4,540 మొక్కలు మంజూరు అయ్యాయని, వాటని గ్రామాల్లో నాటేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీఓ అన్నారు. కాగా నీటి కుంటల నిర్మాణాలు పూర్తి చేయాలని ఈసీ సిబ్బందికి సూచించారు. టీఏలు రామ్‌శంకర్, మురళీ, రాజశేఖర్, ఉమామహేశ్వరి తదితరులు ఉన్నారు.

● **చికిత్స పొందుతూ యువకుడి మృతి**

ఆదోని అర్బన్: పట్టణంలోని శివశంకర్‌నగర్‌కు చెందిన నాగరాజు కుమారుడు బోయ హరి(24) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. గత నెల 31వ తేదీన పెళ్లి కాలేదని మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న హరిని వెంటనే బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతిచెందాడన్నారు.

స్మార్ట్ మీటర్లతో రూ.12 వేల కోట్ల భారం



లక్ష్మీనగర్‌లో స్మార్ట్ మీటర్లు వద్దంటూ స్టిక్కర్లను అతికిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే ప్రజలపై రూ.12 వేల కోట్ల భారం పడుతుందని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు, సి.శేషాద్రి ఆరోపించారు. మంగళవారం కర్నూలులోని 24వ వార్డు లక్ష్మీనగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో «స్మార్టు మీటర్లు వద్దు» అంటూ ఇంటింటికీ స్టిక్కర్లు అతికించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ దిగ్గజం అదానీ కోసమే స్మార్ట్‌మీటర్లను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ బిల్లులు పెంచబోమని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తరువాత ప్రజలపై రూ.20 వేల కోట్ల భారం వేసిందన్నారు. ఇదే సమయంలో రూ.12 వేల కోట్ల స్మార్ట్ మీటర్ల భారం కూడా పడుతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎలా బతకాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో చందు, రాముడు, కర్రెన్న, జ్యోతి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై పునరాలోచన చేయాలి

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై పునరాలోచన చేయాలని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొత్తూరు సత్యనారాయణ గుప్తా మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి సూచించారు. గతంలో తెలుగుదేశం విపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి అధికారంలోకి రాగానే పచ్చజెండా ఊపడం తగదన్నారు. తొలి దశలో 40 లక్షల ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలపై అదనపు భారం పడుతుందని, సామాన్యులకు ఇబ్బందికరంగా మారకుండా చూడాలని కోరారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

● భూసార పరీక్షల ఆధారంగా పంటలు వేయడం ఉత్తమం

● ఏడీఏలు సాలురెడ్డి, అన్నపూర్ణమ్మ ..





డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి, మాట్లాడుతున్న డీఆర్‌సీ ఏడీఏ అన్నపూర్ణమ్మ

కోడుమూరు రూరల్: రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలను సాగు చేసుకోవాలని ఏడీఏలు సాలురెడ్డి, అన్నపూర్ణమ్మ సూచించారు. మంగళవారం కోడుమూరులోని రైతు సేవా కేంద్రంలో ఏఓ రవిప్రకాష్ ఆధ్వర్యంలో ‹వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్› కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ సాలురెడ్డి, డీఆర్‌సీ ఏడీఏ అన్నపూర్ణమ్మ ముఖ్య అతిథులుగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న వేళ భూసార పరీక్షల ఆధారంగానే రైతులంతా తమ భూముల్లో పంటల సాగు, ఎరువులను వాడాలని సూచించారు. నాణ్యతమైన విత్తనాల సాగుతో అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. మందులు, ఎరువుల వాడకంలో పోటీతత్వం పనికిరాదని, పంటకు అవసరమైన మేరకే ఎరువులు, మందులను వాడాలన్నారు. ప్రస్తుతం చాలామంది రైతులు ముందస్తుగా కురిసిన వర్షాలకు పత్తి, కంది పంటలను సాగు చేస్తున్నారన్నారు. రైతులంతా ఒకే టైంలో పత్తి విత్తనాలను విత్తడం ద్వారా గులాబీరంగు పురుగును అదుపులో పెట్టవచ్చన్నారు. ప్రతి రైతు వ్యవసాయ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలను, ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే బనవాసి శాస్త్రవేత్త మౌనిక, హార్టికల్చర్ అధికారి మదన్‌మోహన్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

అనంతరం కర్నూలు ఏడీఏ సాలురెడ్డి కోడుమూరు మండలంలోని విత్తన, ఎరువు మందుల దుకాణాల డీలర్లతో సమావేశమయ్యారు. ఎరువులు, విత్తనాలు, మందులను ఎవరైనా డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి డీలర్ వ్యవసాయ శాఖ అనుమతి పొందిన ఎరువులు, విత్తనాలనే రైతులకు విక్రయించాలని, కాలం చెల్లిన మందులు, విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించరాదని, కొనుగోలు సమయంలో రైతులకు రసీదులివ్వాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఓ రవిప్రకాష్, డీలర్లు పాల్గొన్నారు.